



మొక్కను నాటుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పంటల బీమా వచ్చేనా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో రైతులు పంట నష్టపోయారు. కరువు మండలాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. వర్షాభావంతో పెట్టిన పంట చేతికందక రైతులు నష్టపోయిన దానికి పంటల బీమా ఇంత వరకు రాలేదు. గతేడాది నష్టం ఈ సీజన్ ప్రారంభంలోనైనా వస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా లేదు. కొత్త ప్రభుత్వమైనా ఇస్తుందో లేదో కూడా స్పష్టత లేదు. అంతకు మునుపు ప్రభుత్వం కూడా ప్రకటించలేదు. ఇస్తుందో.. లేదో.. కూడా ప్రకటన లేదు. వరుస నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ సహాయం అయినా అందితే బాగుంటుందని ఆశిస్తున్నారు.

1.79 లక్షల హెక్టార్లలో పంటనష్టం

అనంతపురం జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 2.49 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో 1.79 లక్షల హెక్టార్లలో పంటనష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఈ మేరకు రూ.251 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని ఇచ్చింది. అయితే పంటలబీమా మాత్రం ఇప్పటికీ మంజూరవలేదు. ఎంత జిల్లాకు మంజూరవుతుందోనన్నది ప్రకటన కూడా వెలువడలేదు. వేరుశనగ 81,707 హెక్టార్లలో రూ.138 కోట్లకు ప్రతిపాదించారు. ఆముదం రూ.18.96 కోట్లు కలిపి మొత్తం రూ.251కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. వాతావరణ బీమా మాత్రం ఇప్పటికీ మంజూరవలేదు. జిల్లాలో 28 మండలాల్లో గతేడాది తీవ్ర వర్షాభావంతో పంటనష్టం జరిగింది. ఈ ఏడాది అదే వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది పంటలబీమా అయినా మంజూరయితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.



గతేడాది సాయం కోసం రైతుల ఎదురుచూపు

బీమా మంజూరు చేయాలి

చంద్రశేఖర్‌రెడ్డి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంటనష్టానికి సంబంధించి పంటలబీమాను ప్రభుత్వం ప్రకటించాలి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. ప్రభుత్వం బీమా ఎంత వరకు ఇస్తుందో కూడా చెప్పలేదు. ప్రీమియం అయితే ప్రభుత్వం చెల్లించిందని చెబుతున్నారు. బీమా ఇచ్చి ఆదుకోవాలి. ఈ ఏడాది కరువు పరిస్థితులే నెలకొన్నాయి. పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారు.

మొక్కలను మహావృక్షాలుగా మారుద్దాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-నార్పల

హరిత అనంత కార్యక్రమం కింద నాటిన మొక్కలను మహావక్షాలుగా మార్చే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం కింద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత అనంత కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా విస్తతంగా మొక్కల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను నిత్యం సంరక్షించాలని, దత్తత తీసుకున్న వారు ప్రతినిత్యం నీరు పోసి చెట్లను పెరిగి పెద్దయ్యేవరకు కాపాడుకోవాలన్నారు. కళాశాల ప్రహరీ వద్ద మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. బాధ్యతగా మొక్కలను సంరక్షణ చేయాలని సూచించారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తానని అందరి చేత ప్రమాణం చేయించారు. నార్పల నుంచి కేశేపల్లి పంచాయతీకి వెళ్లే రోడ్డులో కేశేపల్లి గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఏపీడీ అనురాధ, ఏపీవో రమేష్, ఎంపీడీవో రాముడు, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.డేవిడ్, అధ్యాపకులు, విద్యార్థులు ల్గొన్నారు.

'అందరి సహకారం మరువలేను'

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



గౌతమి సాలి

అనంతపురం జిల్లాలో ఎస్పీగా అతి తక్కువ కాలం పని చేసినప్పటికీ తనకు సంతప్తినిచ్చిందని బదిలీపై వెళ్తున్న ఎస్పీ గౌతమిసాలి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలో పని చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.కష్టతర పరిస్థితుల్లో జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినా, పరిస్థితులు చక్కబడే విధంగా ప్రజలు, పోలీసు సిబ్బంది, అధికారులు సహకారం అందించారన్నారు. తనకు సహకరించిన జిల్లా యంత్రాంగం, మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు.

భారత జట్టుకు ఎంపిక గర్వకారణం

బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ద్వారకనాథ్ రెడ్డికి కలెక్టర్ ప్రశంస



క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత్ బాస్కెట్ బాల్ జట్టులో అనంతపురం నగరానికి చెందిన కె.ద్వారకనాథ్ రెడ్డి ఆడడం జిల్లాకు గర్వకారణం అని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. భారత్ బాస్కెట్ బాల్ జట్టులో ఎంపికై ఆడిన ద్వారకనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నాడు కలెక్టర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన కె.ద్వారకనాథ్ రెడ్డి అండర్– 18లో భారత్ బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. అనంతరం రకానాథ్‌రెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీవో షఫీ, బాస్కెట్ బాల్ కోచ్ ఎల్.వంశీ రెడ్డి, తల్లి చంద్రిక, పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతి

ప్రజాశక్తి- కుందుర్పి

పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాకుతో యువ రైతు మృతి చెందిన సంఘటన కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బెస్తరపల్లి గ్రామానికి చెందిన చాకలి దేవరాజు(36) తూముకుంట తలారి ఆనంద్‌కు సంబంధించిన పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్‌కు సంబంధించిన స్టార్టర్‌ను ముట్టుకోగానే కరెంట్ షాక్ తగిలి అక్కడకక్కడే మతి చెందాడు. తోటి రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అక్కులప్ప తెలిపారు.

యువ రైతు మృతి విషయం తెలుసుకున్న వైసిపి యువ నాయకుడు ఎస్.బాబు మృతుని కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపి తలారి రంగయ్య పరామర్శించారు. బెస్తరపల్లి సర్పంచి కొమ్ము మమత, సీనియర్ నాయకుడు కొమ్మ హనుమంతరాయుడు, ఎంపీటీసీ కవిత ఓబులేష్, మాజీ డీలర్ రామదాసు, వైసిపి నాయకులు, లెనిన్ బాబు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.





విద్యుత్ షాక్‌తో పొలంలోనే మృతిచెందిన దేవరాజు (ఇన్‌సెట్‌లో దేవరాజు ఫైల్ ఫొటో)

బాలికలపై అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

బాలికల పట్ల ఎవరు అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక టిడిపి నాయకులతో కలిసి మండల కేంద్రంలో అత్యాచారయత్నానికి గురైన బాధిత బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికపై అఘాయిత్యానికి యత్నించిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజుపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి తగిన న్యాయం చేస్తామన్నారు. అంతేగాకుండా బాధిత బాలిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నియోజకవర్గవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థినులకు ప్రత్యేకంగా 'గుడ్డ టచ్.. బ్యాడ్ టచ్'పై విడతల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు బాల్య వివాహాలను కూడా అరికడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకటనరసనాయుడు, ఆకుల విజయ్‌కుమార్ (బాబు), దారపరేని చంద్రబాబు, ఆకుల అనిల్, ఆకుల తేజ, పరందామ, గవ్వల ప్రసాద్, రాము, గవ్వల లక్ష్మీనారాయణ, పుట్టగోసి పవన్‌కుమార్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



బాలికతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డిని సిపిఎం నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వివిధ వ్యాధులతో వందలాది మంది పేదలు ఓపి చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నాన్నారు. వారికి మెరుగైన వైద్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా డయాలసిస్, అత్యవసర రోగులను దృష్టిలో ఉంచుకుని కరెంటు లేని సమయంలో జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఓపీ రోగులు విశ్రాంతి తీసుకోవడానికి వసతి, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గతంకంటే ప్రస్తుతం రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్యులను నియమించాలన్నారు. రోగులకు అనుగుణంగా స్టాఫ్‌నర్సులు లేని కారణంగా ఉన్న వైద్య సిబ్బంది పని వత్తిడితో మానసికంగా మనోవేదనకు గురివతున్నారన్నారు. తక్షణమే వైద్యుల నిపుణుల సంఖ్య, స్టాఫ్ నర్సులు సంఖ్యను పెంచాలన్నారు. అలాగే మందులు తీసుకోవడం కోసం రోగులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తోందన్నారు. కావున పారామెడికల్ సిబ్బందిని పెంచి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ప్రతి వారం వచ్చే గర్భిణీలు, రోజువారి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల సంఖ్యను పెంచాలాన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న వందపడకల ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా నిర్మిచారన్నారు. అయితే జిల్లా ఉప ఆసుపత్రిగా ప్రకటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రోగుల సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందిని పెంచి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, జగ్గలి రమేష్, సురేంద్ర, రాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎడిఎ ఎం.వెంకటరాముడు

ప్రజాశక్తి-గుత్తి

ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకట రాముడు సూచించారు. మంగళవారం మండలంలోని జక్కలచెరువు గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పొలాలను ఎడిఎ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసిన వేరుశనగ పంట 15 నుంచి 20రోజుల దశలో ఉందన్నారు. గతంలో వేసిన పంటలకు వేరుపురుగు ఆశించిందన్నారు. పైర్లకు 10 నుంచి 30 రోజుల వరకూ ఆశించినట్లయితే కార్బోఫ్యురాన్ లేదా ఫోరేట్ గుళికలు 20 గ్రాములు లీటరు నీటికి కలిపి సాళ్లలో భూమి తడిచేలా పిచికారీ చేయాలన్నారు. తేలికపాటి, తువ్వనేలల్లో వేరు పురుగు నష్టం కలిగిస్తుందన్నారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమి లోపల నుంచి వేరుపురుగు, పెంకు పురుగులు బయటకు వచ్చి వేప, రేగుచెట్లపై ఉంటాయన్నారు. ఆడపెంకు పురుగులు భూమిలో గుడ్లు పెడతాయన్నారు. గొంగళిపురుగు తెల్లగా ఉండి ఎరుపు తలని కలిగి ఉంటాయన్నారు. ఎదిగిన గొంగళి వేరు పురుగు 'సీ' ఆకారంలో ఉండి వేర్లను కత్తిరించి మొక్కలు చనిపోయేలా చేస్తాయన్నారు. వాటి నివారణకు జూలై ఆఖరు వరకూ వేరుశనగ పంటలు సాగు చేసే రైతులు తప్పకుండా లోతు దుక్కులు చేసుకుంటే ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. క్లోరోపైరిఫాస్ ఆరు మిల్లీలీటర్లు ఒక కిలో విత్తనాలకు కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్బోఫ్యురాన్ 3జీ లేదా ఫోరెట్ 3జీ ఎకరాకు ఏడు నుంచి 10 కిలోలువిత్తే సమయంలో భూమిలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎలు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎడిఎ వెంకటరాముడు, అధికారులు

మురుగు కాలువల్లో వ్యర్థాలను వేయొద్దు

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో మురుగు కాలువల్లో వ్యర్థాలు ఎక్కడా నిలబడకుండా పారిశుధ్య అధికారులు, సిబ్బంది రోజూ జాగ్రత్తగా వ్యవహరించాలని మేయర్ వసీం ఆదేశించారు. అనంతపురం నగరంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పవిత్ర హైపర్ మార్ట్ సమీపంలో డ్రెయినేజీలో నీరు సక్రమంగా వెళ్లకుండా దుర్వాసన వస్తుందని రాంనగర్‌లోని పలు ప్రాంతాల ప్రజలు తెలియజేయడంతో మేయర్ సందర్శించారు. మురుగునీరు వెళ్లకుండా ఆగిపోవడం తో వెంటనే అడ్డంగా ఉన్న వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్యం అధికారులకు ఆదేశించారు. అధికారులు జెసిబిని తీసుకొచ్చి రోడ్డు కొంతభాగాన్ని తొలగించి అడ్డంగా ఉన్నటువంటి పలు రకాల వ్యర్థాలను తొలగించారు. వర్షాకాలం కావడంతో నగరంలోని డ్రెయినేజీల్లో నీరు నిలబడితే వర్షం వచ్చే సమయాల్లో ఆ నీరంతా లోతట్టు ప్రాంతాల్లో కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడ చెత్తాచెదారం అడ్డు పడకుండా ఎప్పటి కప్పుడు శుభ్రం చేయించాలని అధికారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి, వైయస్సార్ సిపి నాయకులు కొండ్రెడ్డి ప్రకాశ్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రపంచాన్ని మార్చే విద్యావంతులుగా ఎదగాలి

జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

యువత ప్రపంచాన్ని మార్చగలిగే విద్యావంతులుగా ఎదగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, హైకోర్ట్ సీనియర్ న్యాయవాది కోరి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం విడపనకల్లు మండల పరిధిలోని మాలాపురంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివిధ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అజ్ఞానం, అవినీతి, స్వార్థం పెట్రేగిపోవడం వల్ల ప్రపంచ ప్రజల భవిష్యత్ ఆగమ్యగొచరంగా మారిందన్నారు. ఈ స్థితిని మార్చగలిగే శక్తి యువతకే ఉందన్నారు. దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించినా ఇప్పటికీ మూఢనమ్మకాలను ఆచరిస్తూ మోసపోతున్నారన్నారు. నేటి విద్యార్థులు భావిభారత భవిష్యత్ ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యను అవలంబించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్, కళాశాల ఇన్‌ఛార్జి ఎస్ఓ.హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెవివి నాయకులు

నాసిరకం మందులు అమ్మితే చర్యలు

మండల వ్యవసాయ అధికారి శుభకర్

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఫర్టిలైజర్ దుకాణాల్లో నాసిరకం మందులు అమ్మితే చర్యలు తప్పవని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా శ్రీ లక్ష్మీవెంకటేశ్వర, గౌరీ, విశ్వాస్ ఫర్టిలైజర్ దుకాణాల్లో ఉన్న వివిధ రకాల వ్యవసాయ మందులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీ వెంకటేశ్వర (గంజికుంట) ఫెర్టిలైజర్‌లో అనుమతి పత్రాలు లేని కారణంగా రూ.67,850 విలువజేసే పురుగు మందుల విక్రయాలను నిలుపదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీలకు తావు లేకుండా ఖచ్చితమైన పురుగు మందులనే రైతులకు విక్రయించాలని సూచించారు. మందులు అమ్మిన తర్వాత రసీదులను ఇవ్వాలని ఆదేశించారు. మందులకు సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది చిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి శుభకర్

ఘనంగా కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు


కాలినడకన కుళ్లాయిస్వామికి పానకాలు తీసుకెళ్తున్న భక్తులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్య ఘట్టమైన పెద్దసరిగెత్తు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా భక్తులు భారీఎత్తున తరలివచ్చి కుళ్లాయిస్వామికి బెల్లం పానకంతోపాటు చక్కెరను చదివింపులు చేయించారు. కోర్కెలు తీరిన భక్తులు వారితూకం చెక్కర సమర్పించడంతోపాటు కుళ్లాయిస్వామి అగ్నిగుండం చుట్టూ పొర్లుదండాలు చేశారు. బుధవారం తెల్లవారుజామున కుల్లాయిస్వామి గ్రామంలోని పురవీధుల గుండా స్వామి మెరవని నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం ఉంటుంది. సాయంత్రం కుల్లాయిస్వామి జలధి తరలింపు కార్యక్రమం ఉంటుంది. శుక్రవారం రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, ఆలయ ప్రధాన అర్చకులు హుస్సేనప్ప తెలిపారు.

ఆత్మకూరు : పీర్లపండుగ ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో వెలసిన సర్దానప్పస్వామి పెద్దసరిగెత్తు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు స్వామివారికి బెల్లం పానకంతోపాటు చక్కెరను చదివింపులు చేయించారు. తమ కోరికలు తీరిన భక్తులు వారి తూకం చెక్కర స్వామివారికి సమర్పించారు. బుధవారం తెల్లవారుజామున స్వామిని పురవీధుల గుండా ఊరేగించనున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించనున్నట్లు గ్రామ పెద్దలు, ముస్లిం సోదరులు తెలిపారు.


ఆత్మకూరులో కొలువైన పీర్లు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


మొక్క నాటి నీరు పోస్తున్న జెడ్పీ చైర్ ఫర్సన్ బోయ గిరిజమ్మ, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఒకమొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. గతంలో కరోనా సమయంలో ఆక్సిజన్ కొనుగోలు చేసిన పరిస్థితులను గుర్తు చేశారు. కావున ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం అధికారులతో హరిత అనంతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి వైఖోం నిదియాదేవి, అనంతపురం డిఎల్‌డిఒ ఓబుళమ్మ, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సర్పంచి దేగల లలితమ్మ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని గుమ్మేపల్లిలో హరిత 'అనంత' నిర్వహించారు. ఇందులో భాగంగా గుమ్మేపల్లి నుంచి పాపినేపాల్యం గ్రామం వరకూ రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొక్కల నాటే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగానే మొక్కలు నాటినట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ మొక్క సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివి.రమణ, ఎపిఒ శ్రీదేవి, ఉపాధి హామీ సిబ్బంది ఈసీ దామోదర్, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణస్వామి, అనిల్, అలివేలమ్మ, మోహన్, హరినాథ్, శ్రీనివాసులు, ఓబులేసు, నాయకులు దేగల శ్రీనివాసులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.


గుమ్మేపల్లిలో మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

ఆసుపత్రిలో...

మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రకళ, జగదీష్, కెనరా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రోస్‌విల్సన్, ఆస్పత్రి మాజీ ఛైర్మన్ సి.వెంకటేష్, బి.వెంకటనారాయణ, కె.మసూద్, ఎన్.రాముడు, ఎం.ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీచైతన్య పాఠశాలలో

బెలుగుప్ప : మండలంలోని ఎర్రగుడి, శీర్పి, ఆవులెన్న గ్రామ పంచాయతీల్లో అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బెలుగుప్ప ప్రధాన రహదారి నుంచి ఎర్రగుడి వరకూ, శీర్పి కొట్టాల నుంచి ఎర్రగుడి రోడ్డు వరకూ, ఆవులెన్న నుంచి కొట్టాల రోడ్డు వరకూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, గ్రామ నాయకులు సునీల్, భూపతి, టెక్నికల్ అసిస్టెంట్లు సూర్యప్రకాష్, స్వాతి, అరవింద్, నాగేంద్రప్ప, విజయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు వన్నూర్‌స్వామి, నోమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల సి అండ్ ఎం బ్యాచ్ బ్రాంచిలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ చెట్లే జగతికి మూలాధారమని, చెట్లు లేనిదే మనకు బతుకు లేదన్నారు. వాతావరణం సమతుల్యంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్‌లు రిషిబాల, ముత్యాలన్న, టెన్త్ ఇన్‌ఛార్జి సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ విధిగా తల్లిపేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కురుగుంట గురుకుల బాలయోగి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉదయశ్రీ అనంతపురం అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు విష్ణుప్రియ, రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2, 7 సెవెన్ ఆధ్వర్యంలో బాలయోగి జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని శీర్పి, గంగవరం, దుద్దేకుంట గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు పట్టిక, బయో మెట్రిక్ అటెండెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సకాలంలో బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. కార్యాలయ పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవికుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

పార్టీలకతీతంగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. గండికోట నుంచి పుట్లూరు చెరువు, సుబ్బరాయుడు సాగర్‌కు పైప్‌లైన్ వేసి నీటిని తరలిస్తే శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఏఏ పనులు చేశారని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామలింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వెంటనే గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. తర్వాత అధికారులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో మీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటితోపాటు కరెంటు సమస్య కూడా ఉందన్నారు. త్రీఫేస్ కరెంటు 24 గంటలూ ఉండే విధంగా చూడాలని కోరారు. వెంటనే గ్రామాల్లో కరెంటు సమస్య లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎఇ విజయ్‌ని ఆదేశించారు. బాలికలపై అత్యాచారాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దస్తగిరి, తహశీల్దార్ మల్లికార్జునస్వామి, మండల ఇంజనీరింగ్ యలమనాయుడు, ఎంఇఒ శ్రీదేవి, ఎఒ కాత్యాయని, వైద్యాధికారి శ్రీవాణి, జడ్పిటిసి పిదప సువర్ణ, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కస్తూరిబా పాఠశాల తనిఖీ

స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఎస్ఒ మాధవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి బూస్ట్ తాగారు. వీటిలో పాల కన్నా నీళ్లు ఎక్కువ కలిపి ఉండడంతో పాలతోనే బూస్ట్ తయారు చేసి ఇవ్వాలని సూచించారు. తర్వాత ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని విద్యార్థినులను ఆరాతీయగా తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రస్తుతం ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని, త్వరలోనే శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.


కస్తూరిబా పాఠశాలలో బూస్ట్ తీసుకుంటున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రారంభానికి నోచుకోని కళాశాల పరిశీలన

మండల కేంద్రంలో 2012-13లో రూ.కోటితో నిర్మించి ప్రారంభానికి నోచుకోని జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎందుకు నిరుపయోగంగా ఉందని అధికారులను తెలుసుకుని వీలుంటే ఎస్సీ హాస్టల్‌గా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, నాయకులు పుల్లారెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, రామమునిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, రవికుమార్‌రెడ్డి, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, పెద్దిరాజు, శ్రీనివాసులునాయుడు, వేణు, రంగయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు మార్చాలని వినతి


కిందికి వెలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న మహిళ

పామిడి : పట్టణంలోని 13వ వార్డులో కిందికి వేలాడుతున్న విద్యుత్ లైన్లను మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమారుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ కాలనీలో చాలాచోట్ల విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయన్నారు. అదేవిధం గా సీసీ రోడ్లు వేయాలని, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు టిడిపి నాయకులు స్పందిస్తూ పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కన్వీనర్ బొమ్మా మోహన్, అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, నల్లబోతుల శీన, వెంకటరమణ, హుస్సేన్‌పీరా, బాబు, నారాయణస్వామి, తిమ్మప్ప, చితంబరి, ఆది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుంతకల్లులో దారుణం

అదనపు కట్నం కోసం భార్యను హతమార్చిన భర్త


మృతిచెందిన సాయితేజ, పాతచిత్రం

గుంతకల్లు : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త డబ్బుల కోసం భార్యను వేధించి చివరకు కాలయముడై కర్కశంగా గొంతు కోసి కడతేర్చిన దారుణ ఘటన మంగళవారం తెల్లవారుజామున గుంతకల్లులో చోటుచేసుకుంది. మృతురాలు సాయితేజ (21) తండ్రి నారాయణస్వామి పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... గుంతకల్లుకు చెందిన సాయితేజ, పులికొండ ఒకటిన్న సంవత్సరం క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి పాత గుంతకల్లు శివాలయం వీధిలో నివాసం ఉంటున్నారు. వీరికి 9నెలల కూతురు ఉంది. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న పులికొండ తాగుడుకు బానిసై అప్పులు చేసుకున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈనేపథ్యంలో పుట్టినింటి నుంచి డబ్బులు తీసుకుని రావాలని పులికొండ భార్య సాయితేజను వేధించేవాడు. ఇందుకు సాయితేజ నిరాకరించింది. దీంతో సాయితేజ నిద్రిస్తున్న సమయంలో భర్త పులికొండ కత్తితో అతిదారుణంగా గొంతు కోసి హత్య చేసి పారిపోయాడు. ఉదయాన్నే ఇంట్లో రక్తపు మరకలను గమణించిన స్థానికులు వెంటనే మృతురాలి తండ్రి నారాయణస్వామితోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదనపు కట్నం కింద డబ్బులు కావాలనే కారణంగానే భర్త పులికొండ తన భార్య సాయితేజను హత్య చేసినట్లు మతురాలి తండ్రి నారాయణస్వామి ఆరోపిస్తున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ముగ్గురికి గాయాలు


గాయపడిన యువకులు

అనంతపురం క్రైం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన ఘటన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గుత్తికి చెందిన లెస్టర్ రాయ్, యాడికికి చెందిన భరత్, అనంతపురం నగరానికి చెందిన గిరీష్‌రెడ్డి స్థానిక పివికెకె కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం వ్యక్తిగత పని నిమిత్తం గుత్తి రోడ్డుకు బయలుదేరారు. స్పోర్ట్స్ బైక్‌లో అతివేగంగా వెళ్తున్న వీరు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే వేగాన్ని నియంత్రించలేక ముందుకు వెళ్తున్న కారును ఢీకొన్నారు. దీంతో బైక్ నడుపుతున్న లెస్టర్ రాయ్ తలకు తీవ్రగాయమైంది. భరత్ స్వల్పంగా గాయపడగా వెనుక కూర్చున్న గిరీష్‌రెడ్డి చిన్న గాయాలతో బయటపడ్డాడు. యువకులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండల పరిధిలోని శ్రీపురం గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుత్తిలోని గాంధీనగర్‌కు చెందిన కంబయ్య పని నిమిత్తం తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి గుత్తికి వస్తుండగా శ్రీపురం శివారులో 67వ జాతీయ రహదారిపై అదుపు తప్పిబోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన కంబయ్యను 108వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కంబయ్యను అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఎస్‌ఆర్‌ఐటికి 'ఐసో' సర్టిఫికెట్లు

కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి


'ఐసో' సర్టిఫికెట్ అందుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం సమీపంలో ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలకు అంతర్జాతీయ ధృవీకరణ సంస్థ ఐసో నుంచి 21001:2018, 50001:2018, 14001:2015 సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈమేరకు మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యానికి ఐఎస్‌వో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలో పాఠ్యాంశాల రూపకల్పన, ఉన్నత విద్య ప్రమాణాలు, విద్యార్థికి అనువుగా బోధనా విధానాలు, మంచి వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నందున ఈ సర్టిఫికెట్లు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం


అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు రవీంద్రనాథ్ కల్లమడి, సతీమణి రమాదేవి మనుమరాలు ఆశ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, సుబ్రమణ్యం, సుబ్బారావు, ఓబుళపతి, కిష్టప్ప, నబిరసూల్, నల్లప్ప, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలను సన్మానించుకుందాం

రాజకీయ పార్టీలు, దళిత సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నూతనంగా ఎన్నికైన దళిత ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్.రాజును సన్మానించుకుందామని రాజకీయ పార్టీలు, దళిత సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అఖిలపక్షాలతో నగరంలోని ఎన్‌జిఒ హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఎమ్మెల్యేలను త్వరలో నగరంఓలని లలిత కళాపరిషత్‌లో ఆత్మీయంగా సన్మానించి శుభాభినందనలు తెలిపేందుకు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు మందకృష్ణ, నారాయణస్వామి, కృపాకర్, బంగి నాగ, దాసిగాని కుళ్లాయప్ప, మల్లి, ఎల్లన్న, ఆనంద్, శ్వేరో తిరుపాల్, రంజిత్‌నాయక్, జయనాయక్, తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ అఖిలపక్షాల నేతలు

కార్మిక కుటుంబాలకు పరిహారం చెల్లించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపాలిటీలో పని చేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30ఏళ్లుగా తాడిపత్రి మున్సిపాలిటీలో కార్మికులు ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తూ అనారోగ్య బారిన పడి చనిపోయారన్నారు. అయితే వారందరికీ మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకూ వారికి రావాల్సిన ఉద్యోగాలు గానీ, ఎక్స్‌గ్రేషియా గానీ చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, జగన్మోహన్, మున్సిపల్ పారిశుధ్య కార్యదర్శి వన్నూరప్ప, కమిటీ మెంబర్ శంకర్, ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కోశాధికారి జుబేర్, జిపి.ప్రసాద్, చనిపోయిన కుటుంబ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు


వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిజిఎల్‌సి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఎపిజిఎల్‌ఐసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి మిస్సింగ్ క్రెడిట్ ఖాతాకు జమ చేయడం లేదన్నారు. అదేవిధంగా మెచ్యూర్ అయిన వారి బాండ్లకు సంబంధించిన ఫైనల్ పేమెంట్స్ సంబంధిత డిడిఒ ఎపిజిఎల్‌ఐసి లాగిన్‌కు పంపినా డిప్యూటీ డైరెక్టర్ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రపోజల్స్‌ను తన లాగిన్‌లోనే ఉంచుకుని రాష్ట్ర కార్యాలయానికి పంపకుండా ఆన్‌లైన్ సమస్యలను అని చెబుతున్నారన్నారు. ఇదివరకే అన్ని జిల్లాలకు సంబంధించిన ఫైనల్ పేమెంట్స్ సిఎఫ్‌ఎంఎస్‌కు వెళుతున్నాయన్నారు. జిల్లాలో మాత్రమే వెళ్లడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ బాల కుల్లాయప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్లు సుగుమంచి సురేష్‌బాబు, ఫణిభూషణ్, జిల్లా నాయకులు పరమేశ్వరరెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు కరణం చంద్రశేఖర్ స్వామి, నగర అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, నాయకులు రాజన్న, కృష్ణమూర్తినాయుడు, రమేష్, గంగాధర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం సమీపంలో ఈ నెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ఈ నెల 8వ తేదీన నార్పల మండలానికి చీనీ కాయల కోతకు బొలెరో వాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సారే వీరనారమ్మ(48) అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్దకు సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తచ్చాడుతూ ఉండగా అక్కడున్న వారు ఆయనను విచారించారు. అతను నీరసంగా ఉండటంతో అన్నం పెట్టినట్లు తెలిపారు. అన్నం తిన్న తరువాత అక్కడే పడుకొని ఉండి నిద్రలోనే మృతిచెందాడు. మంగళవారం ఉదయం ఆశ్రమంలోని వారు ఎంతలేపినా లేవకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా మొహంపైన, చేతులపైన అక్కడక్కడ గోరుడు గాయాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. మృతుని ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎలాంటి ఆధారం అభ్యంకాలేదన్నారు. దీంతో మృతదేహాన్ని బత్తలపల్లిలోని మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.